19-8-49

కథానిక

# పర్యవసానం

'సత్యమూర్తి'

'కాఫీలోకి కొంచెం పంచదార కావాలా, పార్వతీ?' అని అడిగింది ఆఫీసరు భార్య కాంతమ్మ, చెంచాతో పంచదార తీస్తూ.

'ఆ, కొద్దిగా...ఊఁ చాలు, చాలు' మొగమాట పడుతూ అంది పార్వతి.

'ఏమో, రాక రాక వచ్చేవు మా యింటికి. అవున్లే. నీకుమాత్రం తీరికేదీ?...అందులో పని మనిషికూడా లేదో యేమో, అన్ని పనులూ నీవే ఒక్కచేతిమీదుగా చేసుకోవాలిపాపం,యేకోలే. ఇంకా నయం. నేనంటూ ఓ ముసలిదాన్ని యిక్కడున్నానని జ్ఞాపకం పెట్టుకుని, చూడ్డానికి వచ్చేవు.' సానుభూతి, కృతజ్ఞత ఉట్టిపడ్డయి ఆవిడ మాటల్లో.

ఎందుకు వచ్చానా అనిపించింది పార్వతికి. ఆవిడ మనసు అప్పుడే మారిపోయింది. పైకి మాత్రం అంది, యేమీ అనకపోతే బాగుండదని:

'అబ్బే, అదేం లేదండి. రావాలనిపించే వచ్చాను. అయినా మీకు వృద్ధాప్యం వచ్చిందని ఎవరన్నారూ?'

'పోనీ, నడివయస్సైనా వచ్చిందా? నేను చూస్తూండగా రెండు యుద్ధాలు జరిగాయి. రెండు యుద్ధాలు చూశాక నాకు ముసలితనం వచ్చిందనే అనిపిస్తోంది. మొదటి యుద్ధం ఇంకా అవుతూండగానే నాకు పెళ్ళయింది.'

అసహనం, ఏవగింపూ కలిగాయి పార్వతికి. ఈ ధోరణి ఆవిడ పుట్టినప్పటి నించి వింటున్నదే.

'పెళ్ళయేటప్పటికి, నాకు పట్టుమని పదిహేనేళ్ళయినా లేవు. పెళ్ళీ, పచ్చిబద్దలూనూ! ఏం పెళ్ళి! పాడు పెళ్ళి! నీకైనా అంతకంటె వయసు మించలేదనుకుంటా——?'

'పెళ్ళినాటికి నాకు పదహారో యేడండీ' ముక్తసరిగా జవాబిచ్చింది పార్వతి. కానే పోగి, యేదో జ్ఞాపకం వచ్చి 'అయితే మరి, పాడు పెళ్ళి అన్నారే, ఎందుచేత?' అని అడిగింది.

నిజానికి యీ ప్రశ్న కాంతమ్మకి ఉత్సాహాన్నే కల్గించింది. అయితే దాన్ని పైకి తెలియనిచ్చేటంత తెలివితక్కువ మనిషి కాదు ఆవిడ.

'ఎందుకంటావా? పదిహేనేళ్ళ పిల్లకి సంసారం అంటే యేం తెలుస్తుంది చెప్పు. పదేళ్ళ తర్వాత జీవితం యెలా వుండేదీ, అంత చిన్న వయసులో యేఆడపిల్లకి అర్థమవుతుం దంటావ్?'

'కాని అర్థం చేసికోగల్గిన వాళ్ళిక లేనే లేరంటారా' యేమీ తోచక అడిగినట్లు అడిగింది పార్వతి.

'అసలు లేరని నే ననను. ఉంటారు ఎవరో కొద్దిమంది పూర్వజన్మ సుకృతం చేసుకున్న వాళ్లు. కాని చాలామంది విషయంలో తీరా పెళ్ళి చేసికొని, జీవితంలో అడుగుపెట్టాక కాని అసలు విషయం బోధపడదు.'

పార్వతి శ్రద్ధగా వింటోంది. కాంతమ్మ ఎక్కడివస్తువు లక్కడ మామూలుగా సర్ది అంది: 'నే నిపుడు చెప్పబోయేది ఎప్పుడోగాని జరగదు. నీకో చక్కని కథ చెప్పమంటావ్?'

'పెళ్ళయిన ఆరుసంవత్సరాలకి నేను సూర్యారావుని ప్రేమించాను. అతనికి గుఱ్ఱపుస్వారి బాగా వచ్చు. మంచి స్ఫురద్రూపి. చూసిన కొద్దీ చూడా లనిపించేటంత ముచ్చటగా వుండేవాడు. మల్లెపూవుల్లాంటి తెల్లటిబట్టలు వేస్తూండేవా డెప్పుడూను.'

తపీమని ఆగింది మధ్యలో. తెచ్చిపెట్టుకొన్నట్లున్న ఆవిడ చిఱునవ్వు పార్వతిలో యిదివరకంతగా కోపాన్ని తెప్పించలేక పోయింది.

'నవలల్లో వర్ణించే పాత్రల్ని చూసి ఆసహ్యించుకుంటాం కాని మన జీవితమే ఒక నవలలాంటిదని అనుకోం. అక్కడే వుంది తప్పంతా, ఉదాహరణకి నా విషయంలో అంతే ఐంది.'

'నా అనుభవమూ చాలావరకు అలాంటిదే.

19-8-47

అందుకే కానీండి, త్వరగా చెప్పండి' పార్వతి ప్రోద్బలించింది.

'విశేషించి చెప్పేందు కేమీ లేదు గాని మా వారంటే నా కెప్పుడూ అసహ్యం వుండేది కాదు. పైపెచ్చు యిష్టంకూడాను. అయితే ఆయ న్నెప్పుడూ నేను ప్రేమించి ఎరగను. మాకు పిల్లాజెల్లాకూడ లేరు. ఏ అడ్డంకులూ లేకపోయి నప్పటికీ, ఆయనంటే నాకున్న యిష్టమే ఆయన్ని విడిచి వెళ్లలేకుండా చేసింది నన్ను. ఆయన నన్ను తిట్టి, కొట్టి బాధిస్తే బాగుండు ననుకునే దాన్ని. ఆ నెపంమీదైనా ఆయన్ని వదిలించుకోవచ్చని.'

పార్వతికి ముళ్లమీద కూర్చున్నట్లుంది. సాంతం వినందే ఆవిడ మనసు కుదుటబడేట్టు లేదు.

'ఆరునెలలకి గాని నేనొక నిర్ధారణ కంటూ రాలేక పోయాను.' పొయ్యిలో మండుతున్న కట్టె పేడొకటి క్రిందికి జారిపోయింది. దాన్ని మళ్లీ పొయ్యిలోకి ఎగదోస్తూ తన కథ పునః ప్రారంభం చేసింది కాంతమ్మ.

'చివరికి నే నొక్కటేముక్క అనుకున్నాను. మావారిని ఒంటరిగా వదిలేసి, సూర్యారావుతో లేచిపోదామని—'

పార్వతి సంతోషానికి మేరలేదు. నెత్తిమీది నుంచి ఏదో పెద్ద బరువు దించిన ట్లనిపించింది. కాంతమ్మంటే సానుభూతీ, ప్రేమా, గౌరవమూ ఆవిడ గుండ్రని కళ్లలో ప్రతిఫలించినయి.

కాంతమ్మ శాంతంగా చెప్పుకు పోతున్నది.

'నాకు యిప్పటికీ బాగా జ్ఞాపకం. ఆ రోజు మా ఆయన క్యాంపుకు వెళ్లారు. డెస్కుదగ్గిరే ఆ రాత్రల్లా ఉత్తరాలమీద ఉత్తరాలు రాస్తూ కూర్చున్నాను. రాయడం, చించివేయడం; రాయడం, చించివేయడం-ఇలా జరిగింది. చివరికి-నన్ను క్షమించాల్సింది — అని మాత్రం రాసి సంతకం పెట్టాను. సూర్యారావుకి స్టేషనువద్ద కలుసుకో మని రాశాను. ఎన్నింటికి నన్ను అక్కడకి రమ్మ నేదీ తంతి ద్వారా తెలియజేయ మన్నాను. నేను పడుకోబోయే టప్పటికి తెల్లగా తెల్ల వారింది. ఉత్తరాలు తీసికెళ్లడానికి మనిషి కూడ వచ్చాడు. అతను వచ్చే టప్పటికి నేనింకా మేలు కునే వున్నాను, ఎందుకో కన్నెత్తి ఉత్తరాల వంక చూసే ధైర్యం లేక పోయింది నాకు. ఎలాగోలాగు మనస్సు చిక్కబట్టుకుని ఆ రెండు ఉత్తరాలూ వాడిచేతిలో పడవేశాను.'

ఇంతలో ఆమె భర్త కామాల్సు తలుపు తోసుకుని లోపలికి రావడంతో కాంతమ్మ కథ మళ్లీ కాసేపు ఆగిపోక తప్పిందికాదు.

'ఆయ నెవరండీ, సూర్యారావుగారా? మీరు ప్రేమించి—'మరి అడగ లేక పోయింది పార్వతి.

'లేదు. ఆయన నా అసలు భర్తే.'

నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది- వెళ్లిపోదామని లేచి నుంచుంది పార్వతి.

'ఏం, అప్పుడే వెళ్తావా? వెళ్దువు గానిలే, కూర్చో. పాపం రాకరాక వచ్చేవు. నీలాగ ఓపిగ్గా వినే వాళ్లని చూస్తే నాకెంతో సర్దా.'

'మరి మధ్యలో ఆగిపోయారు చెబుతూను' అన్నది పార్వతి, 'సాంతం వినేదాకా ఆవిడెలాగా తనని వదిలి పెట్టదని గ్రహించి.

'ఓ, కథ సంగతా? నీకింకా పూర్తిగా చెప్పనే లేదుగా అన్నట్లు. ఆ... జ్ఞాపకం వచ్చింది. ఆ సూర్యారావున్నాడే, అతను తర్వాత మిలిటరీలో జేరాడని తెలిసింది. కొద్దిరోజులకే ఎ. డి. సి. అయినాడని కూడా విన్నట్లు గుర్తు.'

'ఇంతకీ ఆ ఉత్తరాల సంగతి యేమయినట్టు' చాలా చిరాకుగా అడిగింది పార్వతి.

'ఆ, అయితే ఆ రోజు సాయంత్రానికల్లా అనుకున్నట్టే నాకో టెలిగ్రాం వచ్చింది స్టేషనునుంచి. అయితే దానిని పంపింది ఎవరోకాదు. మావారే. జాబులు పొరపాటుగా కవర్లలో పెట్టి, యిచ్చేశానన్న సంగతి తీరా టెలిగ్రాం చూశాక కాని నాకు తెలిసింది కాదు. అంతా అయ్యాక యిప్పుడా విషయం తలుచుకుంటే దేవుడు చేసిన దంతా నా మేలుకొఱకే ననిపిస్తుంది.'

పార్వతి వెళ్లొస్తానని చెప్పి, యింటిదారి పట్టింది.

ఆఫీసరు భార్య యింకా అక్కడే చాలాసేపు యేమో ఆలోచిస్తూ కూర్చున్నది. ఇంతలో ఆవిడ భర్త తిరిగివచ్చాడు. భర్తను చూసి ఆవిడ చమత్కారంగా నవ్వుతూ అంది- 'ఏమండీ, యిలా కొన్నాళ్లు చెప్పగా చెప్పగా, చివరికి నా కథ నేనే నమ్మేస్తానేమో నని భయంగా వుంది!'

( 'కే హారిసన్' వ్రాసిన కథ ఆధారం)